# అపురూప



* రచన: శ్రీ పేరిచర్ల సత్యకుమారి *

సాయం సమయం

లాన్‌లో ఒంటరిగా తిరుగుతున్నది అపురూప.

నౌకరును పిలిచి 'అమ్మ నాన్న ఎక్కడికి వెళ్లారు నీకుకాని చెప్పారా' అని అడిగింది అపరూప.

'పార్టీకి వెళ్తున్నామని చెప్పారమ్మా' అన్నాడు నౌకరు.

'ఎన్ని గంటలకు వస్తామన్నారు' అని అడిగింది అపురూప.

"ఆరు గంటలకు వస్తామన్నారు" అన్నాడు.

చేతికున్న వాచీ చూసింది పదినిమిషాల తక్కువ ఆరు అయింది.

అపురూప శేఖర్ ప్రేమించుకున్నారు. శేఖర్ పెళ్ళి చేసుకుందాం అని తొందరపెడుతున్నాడు. ఎందుకంటే వాళ్ళ అమ్మ నాన్న పెళ్ళి సంబంధం చూస్తున్నారట. త్వరగా మీ వాళ్లతో చెప్పి ఒప్పించు అన్నాడు పొద్దున కాలేజ్‌లో కనిపించినప్పుడు.

నౌకరు టీ తీసుకొచ్చి టేబుల్‌మీద పెట్టాడు.

"టీ సిప్ చేస్తూ అమ్మా నాన్నలకు పెళ్ళి విషయం ఎలా చెప్పాలా అని ఆలోచిస్తుండగా—

బయట కారు హారన్ వినిపించింది.

టీ కప్పు టేబుల్‌మీద పెట్టి హాలులోకి వచ్చింది అపురూప.

"కాలేజ్ నుంచి వచ్చి ఎంతసేపయ్యిందమ్మా" అన్నాడు మాధవరావు.

"అరగంట అయింది నాన్నగారూ" అంది అపురూప.

శేఖర్‌తో తన పెళ్ళి విషయం యెలా మొదలు పెట్టాలా అని ఆలోచిస్తున్నది.

ఏదో అడగాలని సంకోచిస్తున్న కూతురిని చూసి "డబ్బు ఏమన్నా కావాలమ్మా" అన్నాడు మాధవరావు.

"డబ్బు విషయం కాదు నాన్నగారూ" అంది అపురూప.

"మరి ఏ విషయం చెప్పు" నవ్వుతూ అన్నాడు మాధవరావు.

"నాన్నగారూ నేను శేఖర్ అనే అబ్బాయి ఒకరిని ఒకరం ఇష్టపడి ప్రేమించుకొన్నాము. మీ అంగీ కారంతో పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాం" అంది అపురూప వినయంగా.

'ఏమిటే మాకు తెలియకుండా ప్రేమించి పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకొని మా అంగీకారం కావాలని ఇప్పుడు గుర్తుకు వచ్చిందా' అంది కఠినంగా సుశీల.

'అది కాదమ్మా' అపురూప ఏదో చెప్పబోయేంతలో

"రూపా అబ్బాయి ఏం చేస్తున్నాడమ్మా" అడిగాడు మాధవరావు.

'మా కాలేజ్‌లో ఫైనలియర్ చదువుతున్నాడు' అంది అపురూప.

'అయితే రేపు శేఖర్‌ని మన ఇంటికి తీసుకురా' అన్నాడు మాధవరావు.

"ఎందుకు ?" అంది అపురూప.

"అబ్బాయిని చూసి కొన్ని విషయాలు మాట్లాడి పెళ్ళికి ముహూర్తం పెట్టిస్తాను" అన్నాడు మాధవరావు నవ్వుతూ.

అపురూప మనసు అప్పుడు తేలికపడింది.


"అమ్మయ్య ఏమంటారోనని ఎంతో భయపడ్డానో తెలుసా. నాన్నగారు నా మాట మన్నించినందుకు నాకు ఎంతో సంతోషంగా వుంది" అంది అపురూప.

'సంతోషంగా వుంటుంది! ఎందుకుండదూ' కోపంతో మూతి ముడుచుకుంటూ అంది సుశీల.

'శుభమా అని కూతురు పెళ్ళి విషయం చెబితే అలా వున్నావేమిటి సుశీలా' అన్నాడు మాధవరావు.

"ఎప్పుడూ తండ్రీ కూతుళ్లూ ఒకటే" అంటూ ఆపుకోలేక గట్టిగా నవ్వేసింది సుశీల.

"అమ్మదొంగా అయితే నీకూ ఇష్టమే" అన్నాడు




మాధవరావు భార్యతో.

"రూప కోరిక నేను ఎప్పుడన్నా కాదన్నానా" అంది సుశీల.

బయట కారు హారన్ వినిపించింది.

అపురూప ఆదుర్దాగా లేచింది.

'అరుగో నా ఫ్రెండ్స్ వచ్చేసారు టెన్నిస్‌కు టైమైంది వస్తా నాన్నగారూ' అంటూ గోడకున్న బాట్‌ను తీసుకుని విలాసంగా ఊపుకుంటూ వెళ్ళిపోతున్న అపురూపను ఎందు అపురూపంగా చూసాడు మాధవరావు.

"పెళ్ళికి ఎదిగిన పిల్లను అలా ఆటలు ఆడనిస్తారా" అంది ముఖం చిట్లించి సుశీల.

'అబ్బాయితో మాట్లాడి త్వరగా ముహూర్తం పెట్టించండి. వచ్చే నెలలో ముహూర్తాలు వున్నాయట' అంది సుశీల

'అప్పుడే అంత కంగారా' అన్నాడు మాధవరావు నవ్వుతూ.

భవంతి వెనుక నున్న పెద్ద గ్రౌండ్‌లో అపురూప ఫ్రెండ్స్‌తో కలిసి టెన్నిస్ ఆడుతోంది వాళ్ళ కబుర్లూ నవ్వులూ కోలాహలంగా వినిపిస్తున్నాయి భార్యాభర్తలకు.

అపురూప ఆట ముగించి వచ్చి స్నానం చేసింది. బుక్స్ ముందు వేసుకొని చదువుతూ కూర్చుంది.

"రూపా భోజనం పెట్టాను రా" తల్లి పిలుపు.

లేచి డైనింగ్ హాలులోకి నడిచింది.

భోజనం ముగించి మంచం మిద పడుకోగానే నిద్రాదేవి వచ్చేసింది.

* * *

మర్నాడు ఉదయం 9 గంటలకు కాలేజ్‌కు తయారైంది.

'వెళ్ళొస్తానమ్మా' అంటూ బయలుదేరింది అపురూప.

"డ్రైవర్" పిలిచింది.

"వస్తున్నానమ్మా" డ్రైవర్ గొంతు.

కారు బయలుదేరింది.

కాలేజ్ బయట శేఖర్ గురించి చూసింది కనిపించలేదు

ఎందుకు రాలేదబ్బా అనుకుంది మనసులో.

అవర్ మొదలుకావటంతో లోపలికి వెళ్ళిపోయింది.

కాలేజ్ అయిపోయాక ఫ్రెండ్స్ కూర్చుని మాట్లాడుతోంది అపురూప. శేఖర్ కనిపించాడు. ఫ్రెండ్స్‌తో రేపు కలుద్దామని చెప్పి పంపించేసింది.

'హలో! ఏమిటి ఒక్కదానివే కూర్చున్నావూ' అన్నాడు శేఖర్ నవ్వుతూ.

'శేఖర్ నీతో ముఖ్య విషయం చెప్పాలి' అంది అపురూప.

అతనూ ఆమెకు కొంచెం దగ్గరగా కూర్చున్నాడు.

'చెప్పు' అన్నాడు.

"మా నాన్నగారు నిన్ను మా ఇంటికి తీసుకు రమ్మన్నారు నీతో కొంచెం మాట్లాడాలట" అంది అపురూప.

'ఎందుకు' అన్నాడు.

'కాబోయే అల్లుడిని చూసుకోవద్దా' అంది నవ్వుతూ.

'నిజంగా ఒప్పుకున్నారా మీనాన్నగారు' అన్నాడు ఆనందంగా.

'ఒప్పుకున్నారు' అంది అపురూప.

'అయితే పద మీ యింటికి వెళదాం' అన్నాడు శేఖర్.

ఇద్దరూ ఆటోలో ఇంటికి వెళ్ళారు.

లాన్‌లో మొక్కలకు నీళ్ళు పోస్తున్నారు సుశీల, ముధవరావు.

'నాన్నగారు యితను శేఖర్' అని పరిచయం చేసింది అపురూప.

నమస్కారం చేసాడు శేఖర్.

పనిమనిషి కాఫీలు తీసుకొచ్చి ఇచ్చింది అందరికీ.

శేఖర్ మీది ఏవూరు.

"వైజాగు" అన్నాడు శేఖర్.

అమ్మానాన్నగారితో మాట్లాడి ముహూర్తం పెట్టిస్తాను.

శేఖర్ అపురూప ముఖాలు వంద కేండిల్ బల్బులా వెలిగాయి.

'అల్లుడూ అపురూపను అపురూపంగా చూడాలి' అంది సుశీల నవ్వుతూ.

"అలాగే అపురూపంగా చూసుకుంటాను" అన్నాడు శేఖర్.

అందరూ హాయిగా నవ్వుకున్నారు.

